www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్


గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా. తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 2 | సంచిక : 18 | 07-02-2022 | పుటలు : 4


## గాన లత





స్వాతంత్రోద్యమంలో తన గానామృతంతో భారతీయులందరినీ సంగీత సాగరంలో ఓలలాడించిన గానకోకిల లతా మంగేష్కర్. భారత జవాన్ల గౌరవార్థం ఏర్పాటుచేసిన ఒక కచేరీలో సైనికుల త్యాగాలను లతా మంగేష్కర్ 'ఏ మేరే వతన్ కే లోగో, జర ఆంఖ్ మే భర్ లో పానీ..' పాటను హృద్యంగా ఆలపిస్తే ఆ గానామృతంలో సదస్సుకు హాజరైన వారంతా తమనుతాము మరిచిపోయారు. భారత ప్రధాని నెహ్రూ కళ్ళవెంట అశ్రువులు రాలాయి.పాట అయిపోయిన తర్వాత నెహ్రూ కళ్ళు తుడుచుకొంటూ 'నీ పాటతో నన్ను ఏడిపించావమ్మా!' అని అన్నారట.

భారత సినిమా చరిత్రలో అత్యధిక పాటలు పాడి గిన్నిస్ బుక్ రికార్డ్ లను దశాబ్దాల క్రితమే బద్దలు కొట్టిన గానకోకిల లతా మంగేష్కర్. ఆశాభోంస్లే,ఉషలు ఆమె చెల్లెళ్లు. హృదయనాథ్ ఒక్కడే తమ్ముడు. తన తియ్యని కంఠస్వరం, హృదయాన్ని పట్టి పిండేసే గానామృతంతో అశేష భారతావనిని ఓలలాడించింది. 1960 - 80 మధ్యకాలంలో హిందీ సినీరంగంలో ఆమె పాటపాడని చిత్రమంటూ లేదు. ఆమె పొందిన సత్కారాలకు, అవార్డులకు, రివార్డులకు లెక్కేలేదు. ఎన్నో ఫిలింఫేర్ అవార్డులు కాక 1989 లో పద్మభూషణ్, 1999లో పద్మ విభూషణ్ పురస్కారం అందుకున్నారు. 20 భాషల్లో దాదాపు 50 వేలకు పైబడిన పాటలు పాడి చరిత్ర సృష్టించిన లతామంగేష్కర్ కు భారత ప్రభుత్వం అత్యున్నత పురస్కారం"భారతరత్నను" 2001లో ప్రకటించింది. పాటలతో ప్రజలను రంజింప చేయడంలోనే కాకుండా సామాజిక సేవలోనూ లతమంగేష్కర్ ముందున్నారు. పూణేలో మంగేష్కర్ హాస్పిటల్ రీసెర్చ్ కేంద్రాన్ని తన తండ్రి పేరు నెలకొల్పారు.ఈ హాస్పిటల్ కి అనుబంధంగా మహారాష్ట్రలో మరొక వైద్యశాలను నెలకొల్పారు.

సంగీత,సేవా రంగాల్లో ఆమె కృషి చిరస్మరణీయమైనది.వారికి అక్షర నివాళిని అర్పిస్తూ...

- నన్నయవాణి






సంఘ సంస్కర్త శ్రీరామానుజుల విగ్రహావిష్కరణ, ఆ సమతామూర్తిని జాతికి అంకితమిచ్చిన సందర్భంగా శుభాకాంక్షలతో....

- నన్నయవాణి



'సత్యార్థ ప్రకాశిక' గ్రంథం ద్వారా బాల్య వివాహాలు, అంటరానితనం, అజ్ఞానాన్ని, దారిద్ర్యాన్ని, అన్యాయాన్ని, మూఢనమ్మకాల్ని ఎదిరించి పోరాడిన ఋషితుల్యుడు,1857 ప్రథమ స్వాతంత్ర్య పోరాటానికి, సమరయోధులకు ప్రేరణనిచ్చిన ధీరుడు, ఆర్యసమాజ స్థాపకుడు స్వామి దయానంద సరస్వతి జయంతి(ఫిబ్రవరి 12)ఆ సంఘ సంస్కర్తను స్మరిస్తూ అక్షర నీరాజనం!!

- నన్నయవాణి

## పట్టుదలతో సివిల్ సర్వీసెస్ సాధ్యం

### రాజమహేంద్రవరం కమిషనర్ అభిషిక్త్ కిషోర్




సివిల్ సర్వీసెస్ ప్లానర్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ, కమిషనర్

**05.02.22 (మీడియాసెల్)** పట్టుదలతో ప్రణాళికా బద్ధంగా ప్రయత్నిస్తే సివిల్ సర్వీసెస్ సాధ్యమవుతుందని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషిక్త్ కిషోర్ ఐ.ఎ.ఎస్., అన్నారు. శనివారం ఆదికవి నన్నయ యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో సివిల్ సర్వీసెస్ లో అవకాశాలపై ఓరియెంటేషన్ ప్రోగ్రామ్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషిక్త్ కిషోర్ ఐ.ఎ.ఎస్.,లు హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ దేశంలోనే ఉన్నతమైన సివిల్ సర్వీసెస్ ఉద్యోగాలు సాధించాలంటే ఎంతో సాధన అవసరమని అన్నారు. పట్టుదలతో ప్రయత్నిస్తే సాధించలేనిదంటూ ఏది ఉండదని చెప్పారు. తమకున్న వనరులను ఉపయోగించుకొని ఉన్నత స్థానాలకు చేరిన గొప్ప వ్యక్తుల విజయగాథలను తెలియజేస్తూ విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యు.పి.ఎస్.సి.) నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షలు, ఇంటర్వ్యూ ఏ విధంగా ఉంటుందో వివరించారు. ప్రతీ పేపర్ చదవడం, కరెంట్ అఫైర్స్ పై దృష్టి పెట్టడం,అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. పట్టుదలతో ప్రణాళికా బద్ధంగా ప్రయత్నిస్తే సివిల్ సర్వీసెస్ లో అర్హత సాధించవచ్చునని తెలిపారు.దేశానికి సేవచేసే గొప్ప భాగ్యం,ఉద్యోగంలో సంతృప్తి, సమాజంలో గౌరవం ఐ.ఎ.ఎస్, ఐ.పి.ఎస్, ఐ.ఎఫ్.ఎస్. వంటి సివిల్ సర్వీసెస్ ద్వారా దక్కుతాయన్నారు.ఆదికవి నన్నయ యూనివర్సిటీలో విద్యార్థుల ప్రయోజనార్థమై చక్కని కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన వీసీ జగన్నాథరావు,అధికారులను కమిషనర్ అభినందించారు. విద్యార్థులు సివిల్ సర్వీసెస్ పై దృష్టి సారించి దేశానికి ఉన్నత సేవలు అందించాలని సూచించారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ ఉన్నత శిఖరాలకు చేరుకోవటానికి ఆత్మవిశ్వాసం ప్రధానమన్నారు. వ్యక్తిగతంగా విద్యార్థులు తమ శక్తి సామర్థ్యాలను గుర్తించాలని లోపాలను సరిచేసుకుంటూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. సివిల్స్ సాధించాలనే లక్ష్యంతో ప్రణాళికా బద్ధంగా సాధన చేస్తే ఆశించిన ఫలితాలు వస్తాయని తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ విద్యార్థులంతా ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడాలని ఆకాంక్షించారు.ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా.ఎన్.ఉదయభాస్కర్ మాట్లాడుతూ ఆచార్య మొక్కా జగన్నాథరావు గతంలో సివిల్ సర్వీసెస్ పరీక్షలలో ఉత్తీర్ణులైనా తనకెంతో ఇష్టమైన అధ్యాపక వృత్తిలో కొనసాగుతున్నారని చెప్పారు. విద్యార్థి మిత్రునిగా, శ్రేయోభిలాషిగా, విద్యావేత్తగా, మంచి పరిశోధకునిగా వీసీ ఇటువంటి చక్కని కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలియజేసారు. తరువాత విశ్వవిద్యాలయ అధ్యాపకులు వై.మనోజ్ దేవా రచించిన సివిల్ సర్వీసెస్ ప్లానర్ పుస్తకాన్ని వీసీ, కమిషనర్ ఆవిష్కరించారు. అనంతరం అతిథులను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య పి.సురేష్ వర్మ, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా.ఎన్.ఉదయభాస్కర్, డా.డి.శ్రీధర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంటర్న్షిప్ బ్రోచర్ ఆవిష్కరించిన వీసీ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ జగన్నాథరావు

**02.02.22 (మీడియాసెల్)** వికాస మరియు ఆదికవి నన్నయ యూనివర్శిటీ ఆధ్వర్యంలో భారత్ ఎఫ్.ఎ.హెచ్. లిమిటెడ్ సంస్థ శ్రీ సిటీ , నెల్లూరు నందు ఇంటర్న్షిప్ ( ఆన్ ద జాబ్ ట్రైనింగ్ ) మరియు పర్మినెంట్ రోల్ కొరకు అభ్యర్థులను ఆహ్వానిస్తున్నట్టు ఆదికవి నన్నయ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ఆచార్య మొక్కా జగన్నాథరావు తెలిపారు. యూనివర్సిటీలో బుధవారం దీనికి సంబంధించిన బ్రోచర్ ను ఆవిష్కరించి వివరాలను తెలియజేశారు. మూడు నుండి ఆరు నెలలు కాలపరిమితి కలిగిన ఈ ఇంటర్న్షిప్ ట్రైనింగ్ కు ఏదైనా డిగ్రీ (ద్వితీయ & తృతీయ సం.) , ఏదైనా బి.టెక్ ( తృతీయ , ఫైనల్ సం. ) , ఏదైనా డిప్లొమో ఫైనల్ సెమిస్టర్ చదువుతోన్న 18 సం. పూర్తయిన మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు స్టైయిఫండ్ డిగ్రీ చదువుతోన్న వారికి రూ .12,000 డిప్లొమో వారికి రూ .11,000 మరియు వసతి , భోజనం ,రవాణా సౌకర్యం కల్పిస్తారని, ట్రైనింగ్ అనంతరం సర్టిఫికెట్ అందజేస్తారన్నారు. అలాగే పర్మినెంట్ రోల్ ఉద్యోగం కొరకు ఎస్.ఎస్.సి. నుండి డిగ్రీ వరకు ఉత్తీర్ణులైన 18 నుండి 28 సం.లోపు మహిళా అభ్యర్థులు అర్హులు.వీరికి నెలకు రూ .12,000 వేతనం మరియు వసతి , భోజనం, రవాణా కల్పిస్తారు. పై ట్రైనింగ్ మరియు ఉద్యోగాల కొరకు ఆసక్తి గల అభ్యర్థులు శ్రీకాంత్ సెల్ : 87909 35195 , కె . శర్మ సెల్ : 97031 38819 నంబర్లకు సంప్రదించాలని అలాగే వివరాలను vikasajobskkd@gmail.com తెలియజేయాలన్నారు . ఈ కార్యక్రమంలో వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె . లచ్చారావు మరియు వికాస మేనేజర్ శర్మ , యూనివర్శిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# సంపాదకీయం



## ధారణా బ్రహ్మరాక్షసుడు

కవిత్వం జన్మతః రావాలంటారు. కనుకనే అది ఈశ్వరదత్తమైన ప్రతిభాశక్తి. పద్యాలు రాసిన వారంతా కవులు కాలేరు. నిజమైన కవిత్వం ప్రతిభవల్ల పుడుతుంది. భావావేశం రమణీయమైన అక్షరరూపం దాల్చి సహృదయ రసజ్ఞుల్ని ఆహ్లాదపరుస్తుంది. పద్యం హృద్యమై కవనదేవి సాన్నిధ్యంలో ప్రకాశిస్తుంది. హృద్యమైన ఆధునిక తెలుగు పద్యాల్ని, ఉపన్యాసాల్ని, అవధానాల్ని ప్రతిభతో అందంగా హుందాగా మంద మందాకినీ ప్రవాహంలా నడిపిస్తున్న మహా సహస్రావధాని డాక్టర్ గరికిపాటి నరసింహారావుగారు. ఆధునికాంధ్ర సాహితీ క్షేత్రంలో ఉపన్యాసంతో లోతైన విషయాన్ని తేలికగా విశ్లేషిస్తూ, చమత్కారాన్ని పండిస్తున్న నిత్య కృషీవలురు, పరిహాస ప్రసంగ కుశలురు, ఆంధ్రులకు సుపరిచితులు శ్రీ గరికిపాటి.

పద్యంతో వైద్యం చేయగల కవితా ధన్వంతరి. సాగరతీరంలో సహస్రావధానం చేసి ఏడువందల యాభై పద్యాలను ఎనిమిది గంటల్లో ధారణ చేసిన అసలు సిసలు ధారణా బ్రహ్మరాక్షసుడు.

సభను రసప్రవాహంలో ముంచెత్తే సహృదయులు. సంప్రదాయ బద్ధ హృదయులు. తన ఇద్దరు కుమారులకు నవ్యకవితా యుగ కర్తలైన శ్రీశ్రీ, గురజాడ పేర్లు పెట్టిన ఆధునిక భావ సమన్వయవాది, సమగ్ర సత్యవాది.

శ్రీగరికిపాటి కవిత్వం, వ్యక్తిత్వం, హృదయ స్పందన రక్తప్రసారం లాంటివి. ప్రతి మాట ఆయన వ్యక్తిత్వాన్ని చాటుతుంది. ప్రయోగించే ప్రతి పదబంధం అందంగా ఉంటుంది. భారతీయ సంస్కృతి అన్నా, మహాత్ములన్నా ఆయనకు తెలియని ఆవేశం వచ్చి ఆపాదమస్తకం తానే కవిత్వంగా మారిపోతారు. సంస్కృతి శంఖమౌతారు. ఎంతటి ఆవేశంలోనూ, బాధలోనూ, ఆనందంలోనూ తన జీవ లక్షణమైన ఆధ్యాత్మిక చింతనను, వేదాంత తత్వ విచారణను వదిలిపెట్టరు. శ్రీ గరికిపాటి ప్రజ్ఞకు హృదయం ఉంది. ప్రతి సన్నివేశానికి, కదలికకు ఏకకాలంలో సహృదయుడై, సగటు మనిషై, గొప్ప ఉపన్యాసకులై స్పందిస్తారు. కవిత్వాన్ని రంగరించి సత్యం చెబుతారు.

ఏతరం వారికైనా సత్య దర్శనం కలిగిస్తారు. సమాజం గురించి సత్య దర్శనం కలిగేలా మాట్లాడుతారు. బుద్ధుణ్ణి ఎంత అర్థం చేసుకున్నారో హిట్లర్ ని కూడా అంతే చక్కగా అర్థం చేసుకున్నారు. సోక్రటీస్, అలెగ్జాండర్, మహమ్మద్ ప్రవక్త, బ్రిటిష్ వారినీ, భారతీయుల్నీ, సర్వ మానవుల్నీ, ప్రపంచ తత్వాన్ని, శాశ్వత సత్యాలనీ క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. విమర్శకులు అభివర్ణించినట్లు శ్రీ గరికిపాటి అవగాహనా సముద్రుడు. విశ్లేషణా అగస్త్యుడు. సామాజిక మనస్తత్వ శాస్త్రవేత్త. ఆధునికత ఈయన ప్రాస. సంప్రదాయం యతి. మానవత్వం ఛందస్సు. పద్యం, ఉపన్యాసం జనంకోసం కవిచేసే తపస్సు.

పద్యవిద్య పదవ తరగతిలోనే ఆయనలో పరిమళించింది. జొన్నలగడ్డ మృత్యుంజయరావు గారు, ఇంద్రగంటి శ్రీరామచంద్రమూర్తి గారు వంటి మహనీయుల గురుత్వం లభించింది. నూనూగు మీసాల నూత్న యవ్వనంలో వివిధ ఛందస్సుల్లో నాలుగు శతకాలు రచించారు. ఆయన రచించిన బృహత్తర కావ్యం "సాగర ఘోష". ఆ కావ్యం సాగరంలా విశ్వంభరా భ్రమణం. అది విశ్వకావ్యం అని ఆయనే అన్నారు. భారతీయ తాత్విక చింతనా నేపథ్యంలో జగద్గురు ఆదిశంకరుల అద్వైత సిద్ధాంత వేదికమీద రచింపబడిన కావ్యమది.

సాగరఘోషలో రెండు అంశాలు ప్రధానమైనవి. ఒకటి సామాజిక పర్యావరణం కలుషితం కావటం. మనిషి మనసు కలుషితమై కుల, మత, వర్గ, జాతి, భాషా వైషమ్యాల మధ్య సమాజం ఏకతను కోల్పోవటం భావ కాలుష్యం. ఇది మానసిక పర్యావరణం.


రెండవది భౌతిక పర్యావరణం కలుషితం కావటం. భూమి, నీరు, వాయువు, ఆకాశం కాలుష్యం కావటంతోపాటు శబ్ద కాలుష్యం. ఇన్ని రకాలుగా వర్తమాన ప్రపంచం కలుషితమై ఉంది. ఇది ప్రస్తుతం సామాజిక సమస్య కూడా. ఇదంతా భౌతిక పర్యావరణం. మనిషి మనుగడ ప్రశాంతంగా సాగాలంటే ముందుగా భావ కాలుష్యాన్ని తొలగించుకోవాలి. భౌతిక కాలుష్యాన్ని నివారించుకుంటూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి. పాంచభౌతికమైన ప్రకృతిని పరిరక్షించుకుంటూ ప్రపంచ శాంతిని సాధించాలన్నదే సాగరఘోష కావ్య పరమార్థం. దానికి కావలసింది మనుషుల మధ్య ఏకత. సర్వమతాల సారం ఒక్కటేనని, భగవంతుడు సర్వత్రా నిండి ఉన్నాడనీ, నదులన్నీ సాగరాన్ని చేరినట్లు భక్తితో చేసిన ప్రార్థన, నమస్కారం భగవంతునికే చేరుతుందనే విషయాన్ని సమస్త మానవాళి గమనించాలి. కుల, మత, వర్గ, వైషమ్యాలులేని పరమోత్తమ జీవనం ఈనాడు ప్రపంచ శాంతికి అత్యవసరం. ఆ దృష్టితోనే ప్రాచీన పద్యాన్ని, పురాణ విషయాన్ని, ఇతిహాస కథా గమనాన్ని....ఇలా వర్తమాన సమాజానికి అనువర్తింపజేస్తూ సామాజిక వ్యాఖ్యను తమ ఉపన్యాసాల ద్వారా అందిస్తున్న

శ్రీగరికిపాటి వారిని భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో అభినందించటం తెలుగువారిని, భాషను, సాహిత్యాన్ని, ఉపన్యాసాన్ని అభినందించటమే.

# ఫీల్డ్ విజిట్- ఆక్వాకల్చర్ డిపార్ట్మెంట్ విద్యార్థులు

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆక్వా కల్చర్ డిపార్ట్మెంట్ లో శుక్రవారం అకడమిక్ కరికులమ్ లో భాగంగా KVVSN ఇన్ఫ్రా ( India ) ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆక్వా చెరువుల దగ్గరకు వెళ్ళటం జరిగింది. (కోరుపల్లి, పెండ్యాల పంచాయితీ) దీనిలో భాగంగా విద్యార్థులు ఆక్వా చెరువుల దగ్గర టెక్నీషియన్స్ మరియు ఆక్వా చెరువుల యజమానులతో మరియు ఆక్వా చెరువులకు టెక్నికల్ సపోర్టు ఇస్తున్న అవంతి కంపెనీ ఫిడ్ మేనేజర్ మహంతి గారితోనూ మరియు ఆర్.ఎమ్. నరసింగరావుతోనూ విద్యార్థులు మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. సీనియర్ ఫామ్ సూపర్ వైజర్ మరియు టెక్నిషియన్ కె.శ్యామలరావు విద్యార్థులకు ఆక్వాకల్చర్ పై





విస్తృత అవగాహన కల్పించారు. 150 ఎకరాలలో ఉన్న ఆక్వా చెరువులలో విద్యార్థులు కల్చర్ ను విద్యార్థులు నిశితంగా పరిశీలించారు. చెరువులలో హార్వెస్టింగ్ విధానాన్ని , గ్రోత్ మోనిటరింగ్ విధానాన్ని అదే విధంగా ఫీడ్ మరియు వాటర్ క్వాలిటీ విధానాన్ని పూర్తిగా పరిశీలన చేసి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఇటువంటి ఫీల్డ్ విజిట్స్ వలన విద్యార్థులలో ప్రాక్టికల్ అవగాహన పెరుగుతుందని విభాగాధిపతి డా.కె .రమణేశ్వరి తెలియజేశారు. విద్యార్థులతో పాటు ఫీల్డ్ విజిట్ లో ఆక్వాకల్చర్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్న డా. డి.శ్రీధర్ మరియు ల్యాబ్ అసిస్టెంట్ బ్రహ్మారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.




## ఆన్లైన్ బిజినెస్ క్విజ్

తాడేపల్లిగూడెం ఆదికవి నన్నయ యూనివర్సిటి క్యాంపస్ లో కామర్స్ మరియు మేనేజ్మెంట్ విభాగం వారి ఆధ్వర్యంలో ఆన్లైన్ బిజినెస్ క్విజ్ ను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమమునకు కోర్సు కోఆర్డినేటర్శ్రీ జె. కృష్ణం రాజు అధ్యక్షులుగా వ్యవహరించగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. శ్రీ రమేష్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థుల అభివృద్ధికి మరియు మేధాసంపత్తికి బిజినెస్ క్విజ్ ఏవిధంగా దోహదం చేస్తుందో తెలియజేసారు. ఈ కార్యక్రమంలో విభాగ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నాక్ సలహాదారు డా.వి.కృష్ణమూర్తిని అభినందించిన వీసీ

సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ నుండి డా.వి.కృష్ణమూర్తి ఆదికవి నన్నయ యూనివర్సిటీకి విచ్చేసి నాక్ సాధనలో పలు సూచనలు, సలహాలు అందించారు. మంగళవారం యూనివర్సిటీలో వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు డా.వి.కృష్ణమూర్తిని సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ నాక్ సాధనలో ఆదికవి నన్నయ యూనివర్సిటీకి మెంటార్ యూనివర్సిటీగా సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ఉందని అన్నారు. డా.వి.కృష్ణమూర్తి రెండు రోజులు నన్నయ యూనివర్సిటీలోని ఇంటర్నల్ క్వాలిటీ అస్యురన్స్ సెల్ (ఐ.క్యూ.ఎ.సి. )లో నాక్ సాధనకు సంబంధించిన పలు సూచనలు సలహాలు అందించారని చెప్పారు. పాఠ్యాంశాల రూపకల్పన మరియు అభివృద్ధి, బోధన అభ్యాసం మరియు మూల్యాంకనం, పరిశోధన ఆవిష్కరణ మరియు విస్తరణ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలు మరియు అభ్యాస వనరులు, విద్యార్థుల మద్దతు మరియు పురోగతి, పాలన, నాయకత్వం మరియు నిర్వహణ, సంస్థాగత విలువలు మరియు ఉత్తమ పద్ధతులు వంటి ఏడు ప్రమాణాలకు సంబంధించిన సమాచారాన్ని క్షుణంగా పరిశీలించి పలు సూచనలను అందించారని చెప్పారు. ఆయా క్రైటీరియాలకు చెందిన అధ్యాపకులకు పలు సలహాలను చెప్పారన్నారు. స్వీయ అంచన నివేదికను సమర్థవంతంగా తయారు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాక్ ఎక్జిక్యూటీవ్ కోఆర్డినేటర్ డా.కె.వి.స్వామి పాల్గొన్నారు.



డా.వి.కృష్ణమూర్తిని అభినందిస్తున్న వీసీ జగన్నాథరావు

# శతావధాని తాతా సందీప్ శర్మకు వీసీ అభినందనలు

చిన్నవయస్సులోనే అద్భుతమైన ధారణాశక్తిని పెంపొందించుకొని అష్టావధానిగా, శతావధానిగా తాతా సందీప్ శర్మ గుర్తింపు పొందారని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో వీసీ కార్యాలయంలో తాతా సందీప్ శర్మను వీసీ ప్రశంసించి శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆంధ్రవిశ్వవిద్యాలయ బయోటెక్నాలజీలో పిహెచ్.డి. చేస్తున్న తాతా సందీప్ శర్మకు తెలుగు భాషలో అపారమైన పట్టు ఉందని అన్నారు. చిన్నవయస్సులోనే అద్భుతమైన ధారణాశక్తిని పెంపొందించుకున్న సందీప్ 45 అష్టావధానాలు చేసారన్నారు. సాధనతో అష్టావధానిగా, శతావధానిగా ఎదిగిన తీరును ప్రశంసించారు. నేటితరం యువత తమ పాఠ్యాంశాలతో పాటు భాష, సాహిత్యాలపై పట్టు సాధించాలని వీసీ తెలియజేసారు. ఈ కార్యక్రమంలో చిలకమర్తి లక్ష్మీనరసింహం మనుమలు చిలకమర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు పెరుమాళ్ళ రఘునాథ్, తెలుగుశాఖ ఆచార్యులు, నన్నయవాణి ఎడిటర్ డా.తలారివాసు పాల్గొన్నారు.



సందీప్ ను అభినందిస్తున్న వీసీ జగన్నాథరావు





## ప్రతిభా వాణి

### శ్రీ పాలూరి శంకర నారాయణ



శ్రీ పాలూరి శంకరనారాయణ శ్రీకాకుళంలో జన్మించారు. అక్కడే ఉన్నత పాఠశాలలో చదివి కొంతకాలం ఉపాధ్యాయుడిగా పనిచేశారు. సొంతూరు నెల్లూరు అయినప్పటికీ మద్రాసులో స్థిరపడ్డారు. తండ్రి రామానుజం శెట్టి నుండి ఇంగ్లీష్ నేర్చుకున్నారు. తండ్రిలాగానే దుబాసీ (అనువాదకులు) అయ్యారు. తెలుగు, సంస్కృతంలో కూడా మంచి పరిజ్ఞానం సంపాదించి సంస్కృతాంధ్ర పండితుడు అనిపించుకున్నారు. కొంతకాలం విజయనగరం మహారాజు, జయపురం మహారాజు, పిఠాపురం రాజా, నూజివీడు జమీందారుల కుటుంబాల పిల్లలకు ఇంగ్లీషు చదువులు చెప్పారు. తర్వాత మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో గణిత అధ్యాపకునిగాను, మద్రాసు విశ్వవిద్యాలయంలో పరీక్షాధికారిగానూ పని చేశారు. మహారాజుల కుటుంబాలకు చదువులు చెబుతున్న రోజుల్లోనే వారి కోసం ఇంగ్లీష్ పదాలు, వాటికి తెలుగు అర్థాలు జాబితాలు తయారు చేసుకున్నారు. తరువాత దానిని వ్యవస్థీకరించి ఇంగ్లీషు,తెలుగు నిఘంటువుగా తయారు చేశారు. ఇలా క్రమంగా ఆయన తయారు చేసిన నిఘంటువు మొదటిసారిగా 1897లో మద్రాసులో ప్రచురింపబడింది. దాని పేరే "శంకరనారాయణ ఇంగ్లీష్-తెలుగు నిఘంటువు" ఆయన జీవించి ఉండగానే ఐదు ముద్రణలకు నోచుకుంది. ప్రతి ముద్రణకీ కొత్త పదాలు తొడయ్యాయి. ఈ నిఘంటువు ప్రసిద్ధికెక్కి 125 సంవత్సరాలు పైగా తెలుగు వారందరికీ ప్రామాణికంగా నిలిచింది. శంకరనారాయణ గారు 1924-25 ప్రాంతంలో కాలధర్మాన్ని పొందారు. విద్యార్థులకు, తెలుగు ప్రజలకు గొప్ప నిఘంటువును అందించిన శంకర నారాయణ గారికి నన్నయవాణి భక్తి నీరాజనం సమర్పిస్తోంది.




## వీసీకి నన్నయ నాన్ టీచింగ్ సిబ్బంది కృతజ్ఞతలు


వీసీ జగన్నాథరావుకు కృతజ్ఞతలు తెలిపిన నాన్ టీచింగ్ సిబ్బంది

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవోను అమలు పరుస్తూ ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఔట్ సోర్సింగ్ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ వేతనాలను పెంచిన వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావుకు సిబ్బంది కృతజ్ఞతలు తెలియజేసారు. గురువారం యూనివర్సిటీలోని వీసీ కార్యాలయంలో వీసీ జగన్నాథరావును కలిసిన నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ నాయకులు వేతనాలను పెంచిన వీసీకి కృతజ్ఞతలు తెలిపారు. విశ్వవిద్యాలయ అభివృద్ధి, సిబ్బంది సంక్షేమంకోసం తపనచెందే వీసీ జగన్నాథరావు ప్రభుత్వ ఉత్తర్వులు అందిన వెంటనే వేతనాలను పెంచడం హర్షనీయమని నాన్ టీచింగ్ నాయకులు అన్నారు. వీసీ జగన్నాథరావు సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తారని, యూనివర్సిటీ సిబ్బంది అంతా ఒకే కుటుంబంగా భావిస్తారని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులను యూనివర్సిటీ నాన్ టీచింగ్ సిబ్బందికి వర్తింపజేస్తూ అనుమతినివ్వడంతో ఈ ఫిబ్రవరి నెల నుండే పెరిగిన వేతనాలు సాలరీ అకౌంట్ లో జమ అయ్యాయని ఆనందాన్ని వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ సిబ్బంది ఎంతో నిబద్ధతతో, విశ్వవిద్యాలయ అభివృద్ధి కోసం పని చేయాలన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ సిబ్బంది ఆర్థిక జీవన విధానం మరింత మెరుగుదలకు తాను సహకరిస్తానని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న యూనివర్సిటీ నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆశాజనకంగా కేంద్ర బడ్జెట్


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ

నూతన ఆవిష్కరణలతో ఆశాజనకంగా కేంద్ర బడ్జెట్ ఉందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు తెలిపారు. యూని వర్సిటీలోని డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ మరియు డిపార్ట్మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ లోని కీలక అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో భాగంగా నూతన ఆవిష్కరణలతో కేంద్ర బడ్జెట్ ఆశాజనకంగా ఉందని అన్నారు. రాష్ట్రాలకు వడ్డీ రహిత రుణాలు, వ్యవసాయం, విద్య, సంక్షేమం వంటి అంశాలకు పెద్దపీట వేశారన్నారు. ప్రతి తరగతికి ఒక టీవీ ఛానెల్ ద్వారా పాఠాలు, ప్రాంతీయ భాషల్లో పాఠాలు, విద్యా టీవీ ఛానెల్స్ ఏర్పాటు వంటి సాంకేతిక పరమైన అంశాలు కోవిడ్ పరిస్థితులలో భవిష్యత్ విద్యకు ఉపయోగపడతాయన్నారు. డిజిటల్ యూనివర్సిటీల ఏర్పాటు ద్వారా దేశ సాంకేతికాభివృద్ధి మరింత సాధ్యమవుతుందన్నారు. ఆర్బీఐ ద్వారా డిజిటల్ కరెన్సీని అమల్లోకి తీసుకు రావడం మంచి విషయమన్నారు. అన్ని పోస్టాఫీసుల్లో బ్యాంకింగ్ సేవలు, డిజిటల్ పేమెంట్, నెట్ బ్యాంకింగ్, ఏటీఎం సేవల ద్వారా గ్రామీణ మారుమూల ప్రాంతాలకు బ్యాంకు సేవలు అందుతాయన్నారు. దేశ వ్యాప్తంగా గతిశక్తి కార్గో టెర్మినల్స్ నిర్మాణం, జాతీయ రహదారుల నిర్మాణం, మేకిన్ ఇండియాలో భాగంగా ఉద్యోగాల కల్పన, ప్రధాని ఆవాస్ యోజన కింద 80 లక్షల ఇళ్ల నిర్మాణం వంటి ప్రత్యేకతలు ఉన్నాయి. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి పోలవరం ప్రాజెక్ట్ కు ప్రత్యేక నిధులు, విశాఖ రైల్వే జోన్, విభజన హామీలకు నిధులు కేటాయిస్తే మరింత బాగుండేదన్నారు. డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ ఆచార్యులు ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఆచార్య ఎస్. టేకి, డా.ఎన్.ఉదయభాస్కర్, డా.మనోజ్ దేవా, డా.అప్పారావు డిపార్ట్మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ విభాగ అధ్యాపకులు డా.లక్ష్మీ నారాయణ, డా.పి.ఎ.నాయుడు, డా.టి.అనిత లు మాట్లాడుతూ అర్బన్ ఏరియాలో పబ్లిక్ ట్రాన్స్పోర్టులుగా షిప్స్ ఉపయోగాలు వివరించారు. 2023కి ద్రవ్యలోటు 6.4 గా ఉంటుందనే అంచనా, 2022 మూలధన వ్యయం 35.4 శాతానికి పెంపు విషయాలపై చర్చించారు. చిన్న రైతులు, చిన్న పరిశ్రమలకు అనుగుణంగా రైల్వే నెట్వర్క్, వ్యవసాయ క్షేత్రాల పర్యవేక్షణకు కిసాన్‌డ్రోన్‌ల అభివృద్ధి, దేశవ్యాప్తంగా సేంద్రీయ వ్యవసాయానికి ప్రోత్సాహం ద్వారా గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని చర్చించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.





## ఆదికవి నన్నయ యూనివర్సిటీ

ఎం.ఎస్.ఎన్. క్యాంపస్ లో డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ బడ్జెట్ 2022- 23 పార్లమెంట్ లో జరిగిన లైవ్ ను అధ్యాపకులు మరియు విద్యార్థులు క్షుణ్ణంగా పరిశీలించారు. తరువాత దానిపై చర్చా గోష్టిని నిర్వహించారు. అలాగే రాజమహేంద్రవరం క్యాంపస్ డిపార్ట్మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ విద్యార్థులు అధ్యాపకులు బడ్జెట్ సమావేశాన్ని వీక్షించారు.

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, తాడేపల్లిగూడెం క్యాంపస్ లో ఎమ్.బి.ఏ.విభాగంలో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ నివేదికనుద్దేశించి చర్చ జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షునిగా కోర్స్ కో-ఆర్డినేటర్ జె.కృష్ణంరాజు, మరియు ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ ఆచార్య కె.ఎస్.రమేష్ పాల్గొని బడ్జెట్ యొక్క ప్రాముఖ్యాన్ని మరియు అవసరాన్ని భావితరాలకు బడ్జెట్ యొక్క ఉపయోగం మరియు బడ్జెట్ గురించి అవగాహనను కల్పించటం జరిగింది. డా.పి.లలితా రాణి నేతృత్వంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని బడ్జెట్ కు సంబంధించిన వారి వారి నివేదికలను తయారుచేసి అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎమ్.ఎన్.ఎన్. అప్పాజీ,డా.జె.మదన్ మోహన్,జి.సురేశ్ ప్రదీప్,కె.బాబులు మరియు డా.పి. ఉమారజిత పాల్గొని బడ్జెట్ ను ఉద్దేశించి అవగాహనను కల్పించారు.

## వీసీని కలిసిన డా. చినమిల్లి సత్యనారాయణరావు

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావును వై.ఎన్.కళాశాలల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా.చినమిల్లి సత్యనారాయణరావు మర్యాదపూర్వకంగా కలిసారు. యూనివర్సిటీలోని వైస్ ఛాన్సలర్ కార్యాలయంలో వీసీని కలిసిన చినమిల్లి సత్యనారాయణరావు నన్నయ విశ్వవిద్యాలయాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని అభినందించారు. అలాగే ఈ నెల 16వ తేదీన పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలోని తన ఆటోబయోగ్రఫీ పుస్తకావిష్కరణకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని మర్యాపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు యూనివర్సిటీ క్యాలెండర్, జ్ఞాపికను వారికి అందజేసి శుభాకాంక్షలను తెలియజేసారు. ఆటోబయోగ్రాఫీ పుస్తకావిష్కరణకు హాజరవుతామని వీసీ తెలిపారు.


వీసీని కలిసిన డా. చినమిల్లి సత్యనారాయణరావు

# LMS లెర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్

## కోవిడ్ సమయంలో ఆన్‌లైన్ విద్యా వ్యాప్తి



కోవిడ్ వంటి సంక్షోభ పరిస్థితుల్లో కూడా అందరికీ నాణ్యమైన విద్యను అందించాలనే ఆలోచనతో లెర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్ ప్రారంభించాం. ముఖ్యంగా మూరుమూల గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాలలో సాంకేతిక సౌకర్యాలు లేని వారికి కూడా ఎల్.ఎం.ఎస్. సేవలు అందుతున్నాయి. ఉభయగోదావరి జిల్లాల్లోని ఆయా విభాగాల అధ్యాపకుల లెక్చర్స్ తో పాటు ఆయా సబ్జెక్టులలో నిష్ణాతులైన వారి పాఠ్య బోధనలను నాణ్యమైన వీడియోల రూపంలో అందరికీ అందుతున్నాయి. విద్యార్థులు ఏ క్లాస్ మిస్ అయిన, పాఠ్యాంశాలు అర్థం కాకపోయిన వాటిని ఆన్లైన్ ద్వారా వీక్షించే అవకాశాలు ఉన్నాయి. విద్యార్థులకు పాఠ్యాంశాలపై పట్టు పెరుగుతుంది. ఎల్.ఎం.ఎస్. ద్వారా నాణ్యమైన విద్య సులభంగా అందుతుందని మంచి స్పందన వస్తుంది.

**ఆచార్య మొక్కా జగన్నాథరావు,**
**ఉపకులపతి, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం**

## రాష్ట్రంలోనే తొలిసారి ఎల్ఎంఎస్‌ను ప్రారంభించిన నన్నయ



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే తొలిసారిగా ఆదికవి నన్నయ యూనివర్సిటీలో వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రోత్సాహంతో లెర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్ ను ప్రారంభించాం. తక్కువ కాలంలోనే ఎల్.ఎం.ఎస్. ప్రోగ్రామ్ కు ఎక్కువ ఆదరణ వచ్చింది. డిగ్రీ, పీజీ పాఠ్యాంశాలన్ని విద్యార్థులకు సులభంగా అందుతున్నాయి. లాక్ డౌన్ కాలంలో అధ్యాపకులు ఆన్లైన్ పాఠాలను బోధించి అప్ లోడ్ చేసారు. లెర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్ సేవలు మరింత విస్తరించి ఇంజనీరింగ్, ఎడ్యుకేషన్ అంశాలను అందుబాటులోకి తీసుకువస్తారు.

**ఆచార్య టి.అశోక్**
**రిజిస్ట్రార్, ఆదికవి నన్నయ యూనివర్సిటీ**

## డిగ్రీ, పీజీ పాఠ్యాశాలకు ఎల్ఎంఎస్ కేంద్రం



డిగ్రీ, పీజీ కోర్సులకు సంబంధించిన అన్ని పాఠ్యాంశాల నాణ్యమైన వీడియో లెక్చర్స్ ఎల్.ఎం.ఎస్. ద్వారా అందుబాటులో ఉన్నాయి. డిగ్రీకి సంబంధించి 80 శాతం పాఠ్యాంశాల వీడియోలు ఎల్.ఎం.ఎస్. పోర్టల్ లో అప్ లోడ్ చేసాం, పీజీ పాఠ్యాంశాలను పూర్తిచేస్తున్నాం. కోవిడ్, లాక్ డౌన్ వంటి పరిస్థితుల్లో విద్యార్థులకు ఎల్.ఎం.ఎస్. ద్వారా విద్య అందుతుంది. సాధారణ తరగతుల్లో పాఠాలు అర్థంకానీ విద్యార్థులు కూడా ఎల్.ఎం.ఎస్.లో నిపుణుల చెప్పిన పాఠాలను వీక్షించవచ్చు. ఆయా విభాగాలలో నిష్ణాతులు చెప్పిన పాఠాలను వీక్షించడం ద్వారా విజ్ఞానం మరింత పెరుగుతుంది.

**- డా.పి.వెంకటేశ్వరరావు**
**డీన్, కాలేజ్ డెవలప్మెంట్ కౌన్సిల్ (సి.డి.సి.)**

## ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం

మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక విజ్ఞానంలోను మార్పులు వస్తున్నాయి. ముఖ్యంగా కోవిడ్ వంటి సంక్షోభ పరిస్థితుల్లో సాంకేతిక విజ్ఞానం యొక్క అవసరం తెలిసింది. విద్య, విజ్ఞానం, ఆన్లైన్ క్లాసులు, వెబినార్స్, ఆన్లైన్ సదస్సులు వంటి వివిధ రూపాల కమ్యూనికేషన్ విధానాలకు సాంకేతికత సహకారం ఎంతో అవసరమైంది. ఇలా కోవిడ్ సంక్షోభంలో ప్రతీ సంస్థలోను, ప్రతీ వ్యవస్థలోను ఆన్లైన్ సర్వీసులు, లైవ్ టెలిక్లాస్ లు ఎన్నో ప్రసారమయ్యాయి. మరి ఇటువంటి సాంకేతిక విజ్ఞానం అందరికీ పూర్తిగా అందిందా అంటే ప్రశ్నార్థకమే. ఎందుకంటే మారుమూల గ్రామీణ ప్రాంత్రాలు, ఏజెన్సీ ప్రాంతాలు, ఆదివాసి ప్రాంతాలు వంటి చోట్ల నెట్ వర్క్ లు పూర్తిగా లేకపోవడం, సాంకేతిక సమస్యలు తలెత్తడం వంటి అవరోధాలతో సాంకేతిక విద్య అందరికీ అందలేదు. ఈ నేపథ్యంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం లెర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్ (ఎల్.ఎం.ఎస్)ను ప్రవేశపెట్టింది.




ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే తొలిసారిగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎల్.ఎం.ఎస్. కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. యూనివర్సిటీ వెబ్ సైట్ www.aknu.edu.inలో LMS లెర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్ ను ఏర్పాటు చేసారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పాఠ్యాంశాలు బోధించిన డిగ్రీ, పీజీ పాఠ్యాంశాల వీడియో రికార్డుల లింకులను ఎల్.ఎమ్.ఎస్. లో పొందుపరిచారు. దీనితో ఇంటర్నెట్ కమ్యూనికేషన్ లేని ప్రాంతాల వారు కూడా నెట్ వర్క్ పరిధిలోనికి వచ్చినప్పుడు ఆ లింకుల ఆధారంగా వారికి అసరమైన పాఠ్యాంశాలను డౌన్లోడ్ చేసుకొని వీక్షించి ఫలితాలను పొందారు. అందరికీ ఆన్లైన్ విద్య, విజ్ఞాన పాఠ్యాంశాలు అందుతున్నాయి.

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు సృజనాత్మకమైన ఆలోచనలతో 19 డిసెంబర్ 2020 ఎల్.ఎం.ఎస్. ను ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రరెడ్డి విచ్చేసి సీడీని ఆవిష్కరించారు. వీసీ వినూత్నంగా ప్రారంభించిన ఎల్.ఎం.ఎస్. విద్యార్థులకు ఎంతో ప్రయోజనమని ప్రశంసించారు. నాటి నుండి నేటి వరకు డిగ్రీలోని - బిఏ, బి.ఏకామ్, బి.కామ్ ఒకేషనల్ మరియు బి.ఎస్సీ. కోర్సులలోని అన్ని పాఠ్యాంశాల నాణ్యమైన వీడియో లెక్చర్స్ ను సేకరించి ఎల్.ఎం.ఎస్. ద్వారా యూనివర్సిటీ వెబ్ సైట్ లో పొందుపరిచారు. ఇప్పటి వరకూ డిగ్రీ పాఠ్యాంశాలకు సంబంధించి 3010 వీడియోలు ఎల్.ఎం.ఎస్. ద్వారా అందుబాటులో ఉన్నాయి. డిగ్రీకి సంబంధించి 80 శాతం పాఠ్యాంశాల వీడియోలు ఎల్.ఎం.ఎస్. పోర్టల్ లో అప్ లోడ్ చేసారు. అలాగే పీజీ కోర్సులలోని సుమారు 200 వీడియో లెక్చర్స్ కు సంబంధించిన వర్క్ లు జరుగుతున్నాయి. డిగ్రీ, పీజీ కోర్సులకు సంబంధించిన పూర్వ ప్రశ్నపత్రాలను కూడా పి.డి.ఎఫ్. రూపంలో ఎల్.ఎం.ఎస్. ద్వారా విద్యార్థులకు అందిస్తున్నారు.

## పాఠాలతో పాటు ప్రశ్నాపత్రాలు






లెర్నింగ్ మేనేజ్మెంట్ స్టడీస్ లో డిగ్రీ, పీజీల సెమిస్టర్ పాఠాలతో పాటు గడిచిన సంవత్సరాలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను అందుబాటులో ఉంచాం. దీని ద్వారా విద్యార్థులు తాము చదువుతున్న పాఠ్యాంశాలలో ఏది ముఖ్యమైనది అని సులభంగా తెలుసుకుంటున్నారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు వినూత్న ఆలోచనలతో విద్యార్థులకు నాణ్యమైన విద్య సులభతరంగా అందుతుంది. త్వరలో డిగ్రీతో పాటు పీజీ, ఎడ్యుకేషన్ కు సంబంధించిన అన్ని పాఠ్యాంశాలు అందుబాటులో ఉంటాయి.

**డా.వై.సుష్మప్రియ**
**ఫ్యాకల్టీ అసోసియేట్, కాలేజ్ డెవలప్మెంట్ కౌన్సిల్**
**కె.గిరిధర్ సాయి.సాంకేతిక సహాయకులు (ఎల్.ఎమ్.ఎస్.)**

## ఎల్ఎంఎస్‌తో ఎంతో ఉపయోగం



ఆదికవి నన్నయ యూనివర్సిటీ అనుబంధ కళాశాలలో చదువుతున్నాను. విశ్వవిద్యాలయం ప్రారంభించిన లెర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్ ద్వారా నాణ్యమైన డిగ్రీ పాఠాలు నేర్చుకోగలుగుతున్నాం. మా అధ్యాపకులు చెప్పిన పాఠాలతో పాటు మరికొన్ని కొత్త విషయాలను తెలుసుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఎల్.ఎం.ఎస్. చాలా ప్రయోజనకరంగా ఉంది. విశ్వవిద్యాలయ అధికారులకు ధన్యవాదాలు.


**- ఎం.సునీల్, బి.ఎస్సీ కంప్యూటర్స్ విద్యార్థి**
**బిహెచ్.ఎస్.ఆర్-వి.ఎల్.ఎం.డిగ్రీ కాలేజ్, దేవరపల్లి**


## సాంకేతిక సమస్యల అడ్డుతొలగింది




ఏజెన్సీ ప్రాంతంలో సాంకేతిక సమస్యల కారణంగా ఆన్లైన్ క్లాసులు సరిగ్గా హాజరు కాలేకపోయాం. యూనివర్సిటీ ప్రవేశపెట్టిన లెర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్ ద్వారా ఇంటర్నెట్ పరిధిలోనికి వచ్చినప్పుడు అవసరమైన పాఠాలను డౌన్లోడ్ చేసుకుంటున్నాం. ఇంటర్నెట్, సాంకేతిక సమస్య అడ్డుతొలగింది. నాణ్యమైన పాఠాలు డౌన్లోడ్ చేసుకొని వింటున్నాం. చాలా ప్రయోజనకరంగా ఉంది. వీసీ సార్ కి, యూనివర్సిటీ అధికారులకు కృతజ్ఞతలు.

**- కె.శ్రావణి కుమారి, బికామ్**
**ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రంపచోడవరం**




ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in